

# ఇది ఆత్మహత్య కానే కాదు

* రచన ; శ్రీ వేముల ప్రభాకరుడు *

రాత్రి పదిగంట లయింది. నేను కరంటుదీపం వెలుతుర్లో కూచున్నాను. నాకు తోడు యెవ్వరూలేరు. నా యెదురుగా పెద్ద గోడౌను దాన్నిండా బియ్యము, చక్కెర నానారకాల పప్పులబస్తాలు వరుసగా పేర్చిపెట్టబడిఉన్నాయి. వాటికి కాపలాగా నేను కూర్చున్నాను. నేను రోడులో కూర్చోవల్సినవాన్ని. రాత్రికి మారడానికి కారణం ఉన్నది. ఆనాడు అయిదుగంటలప్పుడు దినసరి కార్యక్రమం అయినతరువాత షటర్ వేస్తుంటే యేదో పొరపాటువల్ల రోలింగ్ షటర్‌లోని రాడ్ విరిగిపోయింది. షటర్ మూయరాకుండా అయింది, దాన్ని బాగుచేయించే దాకా నేను అక్కడినుండి కదలరాదు, గోడౌను అసిస్టెంట్‌గా అది నా బాధ్యత. మెకానిక్‌కు కబురంపి నేను అక్కడే ఉండిపోయాను. వాడు కొత్తరాడ్ కొనుక్కొని వస్తున్నానని కొద్దిసేపటిక్రిందే ఫోన చేశాడు. హమాలీ మనుషులు గోడౌన్‌లో పనిచేసే స్వీపరు నాకు తోడు ఉంటానన్నారు. వాళ్ళ ఉబుసుపోక మాటలు నాకు తలనొప్పి పుట్టిస్తాయి. ఒక హమాలీని మెకానిక్‌కోసం పంపించి ఒంటరిగా కూర్చున్నాను.

బయట యేమాత్రం గాలి వీచడంలేదు. ఒంటరిగా విశాలమైనగోడౌన్‌లో కెళ్ళి ఫ్యాన్ వేసుకుని కూర్చోబుద్ధి కావడంలేదు. ఆఫ్యాన్ బయటికి లాగిపెట్టుకోవాలని తోచింది. మధ్యలోనే ఆగిఉన్న షటర్ కిందినుండి గోడౌన్ లోనికి దూరబడ్డాను. వంగి దూరబడడంలో నా తెల్లగుడ్డలు పాడయ్యాయి. దులుపుకొని టేబులు దగ్గరకుపోయాను. ఫ్యాన్ తీసి షటర్

బయటపెడదామంటే వైరు అందేటట్టులేదు. ఫ్యాన్ లేకుండా బయట కూర్చోనూలేను. గత్యంతరంలేక టేబుల్ ఫ్యాన్ ఆన్ చేసుకుని కుర్చీలో కూలబడ్డాను. గాలి చల్లగా వీస్తుంది. ఎంతో హాయిగా తోచింది. నాకు తెలియకుండానే చిన్న కునుకుపట్టింది. బయట డ్యూటీలోఉన్న వాచ్ మన్ బూట్ల టక్ టక్ కు ఉలిక్కిపడి లేచాను. 'క్యాసాబ్ అందర్ హై' అంటూ పలకరిస్తున్నాడు. 'హాఁ...హాఁ...' అంటూ అలాగే కూర్చుండిపోయాను. కునుకు మళ్ళీ అందుకుంది. నేను నిద్రలో పడిపోయాను. ఆ నిద్రలో నాకో కల వచ్చింది. ఆ కలలో ఒక యువకుడు. వయసు 25 కు మించదు. కనుముక్కు తీరునుబట్టి అందంగా ఉంటాడని చెప్పవచ్చు. చేతిలో ఒక ఎర్రని రిజిష్టరు పట్టుకుని ఉన్నాడు. ఆయన కళ్ళు దీక్షతో నన్నే చూస్తున్నట్టు అనిపిస్తుంది. ఆ కళ్ళల్లో ఎంతో పీలి. ఆయన చేతిలోని రిజిష్టరు ఎరుపుదనం చూసినకొద్దీ పెరిగిపోతుంది. జాజులా, రక్తంలా, ఎరుపుగా ఇంకా ఎరుపుగా మారింది. కొద్దిసేపటిలోనే అది మండే అగ్ని అంతటి ఎరుపులో నా కళ్ళకు దగదగ కనిపించింది. ఇంకా ఆ రిజిష్టరును నేను పట్టుకోనన్నట్టు యువకుడు ఒకపెట్టున విసిరికొట్టాడు. అది నా చేతిలో బళ్ళుమన్న చప్పుడుతో వచ్చిపడింది. ఇపుడా యువకుని కళ్ళల్లో కాంతిలేదు. అసలు కళ్ళే లేవు. కొన్ని క్షణాలకు ఆయనే లేడు. మరుక్షణంలోనే నే నాకలలో లేను. వాస్తవంలో పడిపోయాను. ఫ్యాన్ తిరుగుతున్నా నాఒళ్ళంతా చెమటలు పట్టింది. కళ్ళు నులుముకున్నాను. నా కెదురుగా టేబులుపై కలలో కనుపించిన రిజిష్టర్ అనే స్టాక్ రిజిష్టర్ కనిపించింది. అది కలలోనుండి ఊడిపడింది కాదని ఆ టేబులుపై ఆ రిజిష్టరును నేనే పెట్టానని నాకు తెలుసు. కాని నాకన్నా ముందు ఆరిజిష్టరును మెంటేన్ చేసినవా రింకొకరున్నారు. ఎవరోకాదు నాకు కలలో కనిపించిన యువకుడే రిజిష్టరును నాపై విసిరిన యువకుడే. ఇహ నేనక్కడ వుండబట్టలేకపోయాను. భయంతో షటర్ క్రింది నుండి వీగి బయటికి వచ్చేశాను, కొన్ని నిముషాల దాకా నా గుండెదడ ఆగలేదు. అంతలోనే బయటినుండి మెకానిక్ ను వెంటబెట్టుకుని మా హమాలీ వచ్చేశాడు. వాళ్ళను చూశాక నేను పూర్తిగా మామూలు మనిషినైపోయాను. 'జెర జలిస మయింది సార్ జెల్ది వేసేస్తం కూసుండుండి' అన్నాడు మెకానిక్. నేను బయట కుర్చీ వేయించుకుని కూర్చుని తిన్నగా ఆ యువకుని ఆలోచనలో పడిపోయాను.


♦ ♦ ♦ ♦

రామరాజు మంచి ఉత్సాహం గల యువకుడు. ఒక కో-ఆపరేటివ్ సంస్థ నడుపుతున్న గోడౌన్ లో గోడౌన్ అసిస్టెంట్ గా పనిచేసేవాడు. డిస్ట్రిక్టు కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలు ప్రొక్యూర్ చేసిన చాలారకాల ధాన్యాలు ఆ గోడౌన్ నుండి అమ్మబడుతుండేవి. బయటి మార్కెట్ లో క్వాలిటీ బియ్యం దొరకవని సొసైటి నడుపుతున్న గోడౌన్ కాబట్టి ప్రజలు ఇటు చాలా వచ్చేవారు,



రేషన్ కార్డుల గొడవ వుండదు కాబట్టి ఎవరికీ ఇక్కట్టుగా ఉండేది కాదు. బియ్యం, పప్పులు కొనుక్కుపోయే యెందరితోనో రామరాజు ప్రేమగా మాటాడేవాడు. 'యేమండీ రామ రాజుగారూ! ఈసారి అక్కుళ్ళు తీసుకోమంటా రా? లేక ములగొలుకులు బాగున్నాయా? కాదంటే మసూరి ఇప్పించండి. అన్నం బాగా అవుతుందంటున్నారు' అని ఒక్కొక్కరు పెద్ద ప్రశ్నలడిగినా ఆయన విసుక్కోకుండా జవాబు చెప్పేవాడు. ఆయనపైన సూపర్‌విషన్‌కు సూపరింటెంటు, డెవలప్‌మెంటు ఆఫీసరు ఉండే వారు. ఆయనక్రింద పనిచేయడానికి 20 మంది హమాలీలు ఉండేవారు. అందరూ ఆయన్ను ప్రేమగా చూసేవారు. కారణం ఆయన తలచు కుంటే అందరికీ సహాయం చేయవచ్చు. తరువాత తిప్పలు పడనూవచ్చు. ఆ తిప్పలు సంగతి ఆయన తెలుసుకోలేకపోయాడు. పై ఆఫీసర్ల ప్రీతిమాటలకు లొంగిపోయాడు. ఏది కావా లంటే అది ఫ్రీగా ఇస్యూ చేశాడు. తరువాత వస్తుందనుకున్నాడు. ఆఫీసర్లుకదా అని నమ్మి ఊరుకున్నాడు. తమ దీనావస్థ చెప్పుకున్న హమాలీలకు బియ్యం ఇచ్చాడు. ఆఫీసుప్యూన్ల కు అప్పులిచ్చాడు. అంతా, తనను ధర్మదాత అనడంతో మురిసిపోయాడు. నెలనెలా రిపో ర్టులు పంపుతుంటే చూసి మురిసిపోయేవారే కాని గోడౌన్ స్థితి యెలావుందని చెక్ చేసి పోయినవారు లేరు. రామరాజు అంటే రాముడే అనుకుని ఊరుకున్నారు. నిజంగాకూడా ఆయన దోచుకుతిన్నది లేదు. కొందరు స్వార్థపరుల ద్వారా ఆయన దోచుకోబడాడు.

సంవత్సరాంతంలో జరుపబడే ఆడిట్‌లో రామరాజు నిజస్థితి బయటపడింది. బియ్యము పప్పులు తీసుకొని ఇప్పుడే బిల్ పంపుతా నన్న వారు యెవరూ పంపలేదు. ఆయన అడిగినా లాభంలేకపోయింది. ఆఫీసులో పనిచేసేవారే కదా సెక్షన్‌లో రిపోర్టు చేస్తే సరిపోతుందనుకో డానికి కూడా వీలులేదు. ముందుగా బిల్



నాగేశ్వర ప్రొడక్షన్స్‌వారి

'ఉత్తమ ఇల్లాలు'లో

కృష్ణకుమారి-నాగభూషణం

రామమోహన్.

లేకుండా నువ్వు యెందుకు ఇచ్చావని అడుగుతారు. చేసిన తప్పును సరిదిద్దుకోవాలంటే, కనీసం పదివేల రూపాయలు కావాలి. పది పదులుకూడా ఇపుడు తనలో లేవు, ఆయన కేమీ తోచలేదు. తోచిందల్లా ఒకటే. అదే అమలుచేసి చూపించాడు, తను తెలియక చేసిన తప్పుకు శిక్ష తనంతట తాను తనకే విధించుకున్నాడు, లోకాలకు వెలుగులను చిమ్మె విద్యుత్తుతో తన జీవనజ్యోతిని ఆర్పుకొని చీకట్లలో కలిసిపోయాడు, రామరాజు ఆత్మహత్య జేసుకొని చనిపోయాడు, ఆయన భారం నాకు అంటగట్టబడింది, కలలో ఆయన స్టాక్ రిపోర్టును నాపైకి విసరడానికి ఇదేసూచనేమో! విద్యుత్ ఘాతానికి చిట్లిపోయిన ఆయన కళ్ళలో నే నొక స్ఫూర్తిని మాత్రం దర్శించాను ''నువ్వు ఆ స్థితి తెచ్చుకోగూడదు-''

## గమనిక.

మా కరీంనగర్ ఏజెంటు శ్రీ ఎం. గోపాలంగారు 'కథాంజలి' అంకెల పోటీలు జరిపించగా సెప్టెంబర్ 1973 నెల సంచికలో గెలుపొందిన నెం. 92 వారి పేరు:—

శ్రీ ఎస్. రాజయ్య
s/o శ్రీ ఎస్. శంకర్, (క్లార్కు)
పెద్దసముద్రాల పోస్టు
(వయా) కనిగారం
(కరీంనగర్ జిల్లా)

పై గెలుపొందిన వారికి 'కథాంజలి' 4 నెలల సంచికలను ఉచితముగా పంపబడును.

సం॥ కథాంజలి

* * *

'కామ్ హోగయా సాబ్' అన్నాడు మెకానిక్ అప్పటికి రాత్రి 12 గంట లవుతుంది, నేను గోడౌన్‌కు తాళం వేసుకొని ఇంటి మొగం పట్టాను, ప్రొద్దున ఆఫీసులో సూపరింటెంట్ 'ఒక బస్తా బియ్యం రేపు వేయించవయ్యా తరువాత బిల్ పంపుతాను' అన్న మాటలు జ్ఞప్తికొచ్చాయి, నేను ఏమి అనలేదు అప్పుడు ఇప్పుడు రామరాజే నాకు దాని ఫలితాన్ని స్ఫురణకు తెచ్చాడు, ఆయనలా నేను మోసపోగూడదన్నదే రామరాజు ఆశయం, 'రామరాజు ఆత్మహత్య చేసుకున్నా' డంటారు మా ఆఫీసులో, కాని కుత్సితులైన పెద్దమనుషులు అమాయకుడైన రామరాజును అమానుషంగా హత్యచేసా రంటాను నేను.

అందానికి......
మన్నికకు......
''సెంజి'' బనియన్‌లనే వాడండి.



Trade Mark Regd. No. 9087/73
వివరములకు
SENJI KNITTING CO.,
1-A, Arthanari Chettiar Lane
TIRUPUR 4.